ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్‌కు నివాళి





కూకట్‌పల్లి: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుల మార్గదర్శనంలో గణిత క్విజ్, గణిత రంగోళి పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులతో గణిత గుర్తులు, రామానుజ సంఖ్యను ఏర్పరచి గుర్తుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నజీమొద్దీన్ మాట్లాడుతూ.. నిజ జీవితంలో గణితం పాత్ర ఎంతో ఉందన్నారు. గణితం లేనిదే జీవితం లేదని పేర్కొన్నారు. విద్యార్థులు గణితం పట్ల అభిరుచి పెంచుకుంటే ఉన్నత స్థానం చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దమయంతి, మంజులవాణి, శ్రీనివాస్, నర్సిములు, శర్మ, సత్యనారాయణ రెడ్డి, వెంకట్‌రెడ్డి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు నివాళి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలూరు అలివేలు మంగమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డా. బచల భవాని, అకాడమిక్ కో ఆర్డినేటర్ డా. మామిడాల రమేష్ బాబు, గణిత శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. నిమ్మ విజయ, ప్రొఫెసర్లు భాస్కర్‌రెడ్డి, డా. పిల్లి సురేష్‌బాబు, డా. కంకిపాటి శ్రీనివాసరావు, డా. గుంటి అమరావతి, డా. పల్లె వినోద్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పంచశీల పాఠశాలలో..

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ... రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం నిర్వహించుకుంటున్నామని విద్యార్థులకు తెలిపారు. గణిత శాస్త్రానికి సంబంధించిన నమూనాలను పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. ఈ వేడుకల్లో పాఠశాల చైర్మన్ డి. అనిత, ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





మూసాపేటలోని పంచశీల పాఠశాలలో ప్రదర్శనలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ డా. అలివేలు మంగమ్మ

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు



ముస్తాబైన దేవాలయాలు



మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయాల కమిటీలు పేర్కొన్నాయి. ఈనెల 23న ఉదయం 4.15 గంటలకు అల్లాపూర్ డివిజన్‌లోని భూనీల సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, పర్వత్‌నగర్‌లోని పర్వతగిరి శివాలయం, మూసాపేట డివిజన్‌లోని శ్రీపాండురంగానగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం చేసుకోవచ్చని తెలిపాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి వసతి ఏర్పాట్లు చేశాయి. ఉదయం 11.30 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గోవధ నిషేధానికి ఉద్యమించాలి

గోవిలాపం కావ్యావిష్కరణలో గౌరీశంకర్

కూకట్‌పల్లి: సాధన సాహితీ స్రవంతి, భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని బీవీపీ సత్సంగ్‌హాల్‌లో ప్రముఖ కవి డా. కె. సాంబమూర్తి రచించిన గోవిలాపం కావ్యావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ దర్శకులు లక్ష్మణరేఖ గోపాలకృష్ణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అశ్విని సుబ్బారావు, సీహెచ్ హనుమంతరావు, రోటరీ సభ్యురాలు శ్రీదేవి ఆత్మీయ అతిథులుగా పాల్గొని రచయితను అభినందించారు. ప్రముఖ సామాజిక సేవా తత్పరులు రమాదేవి, కేఎస్ రాజు దంపతులకు ఈ గ్రంథాన్ని అంకితం చేశారు. ప్రముఖ సంఘ సేవకురాలు అల్లు నిర్మల 20మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు దానం చేశారు.

ఈ సందర్భంగా లక్ష్మణరేఖ మాట్లాడుతూ... అన్ని జీవులపైనా దయ చూపటం మన బాధ్యత అని అన్నారు. గోవుపై మరింత ప్రేమను చూపడం మన ధర్మమని అన్నారు. ఈ విషయాన్ని కవి సాంబమూర్తి తన పద్యాలతో వివరించారని తెలిపారు. గౌరీ శంకర్ మాట్లాడుతూ... గోవధ నిషేధానికి ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. అమ్మలాంటి గోవును హింసించటం పట్ల తన ఆగ్రహాన్ని ఈ శతకంలో రాశారని తెలిపారు. ఈ సందర్భంగా గోవిలాపం పద్య పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో గోడవర్తి సంధ్య, సాధన నరసింహాచార్య, నరేంద్ర, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గోవిలాపం కావ్యావిష్కరణలో పాల్గొన్న రచయిత సాంబమూర్తి, అతిథులు

బీజేపీ ప్రభుత్వం ఎంపీలకు రక్షణ లేకుండా చేసింది

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్



ఇందిరా పార్కు వద్ద నిరసన తెలుపుతున్న బండి రమేష్, హరివర్ధన్‌రెడ్డి

కూకట్‌పల్లి: పార్లమెంట్‌కు చెందిన 141 మంది సభ్యులను నిరంకుశంగా సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా పార్కు వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ నిరసనలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లోకి ఆగంతకుల చొరబాటును నిరోధించలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. భద్రతా వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి చేసిన ప్రయత్నమే పార్లమెంటు సభ్యుల మూకుమ్మడి సస్పెన్షన్ అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నియంతృత్వ పోకడలు పనికిరావని అన్నారు. గొప్పలు చెప్పుకునే మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ సభ్యులకే రక్షణ లేకుండా చేసిందని విమర్శించారు. దేశచరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఇంత మంది ఎంపీలను సస్పెండ్ చేయటం దారుణమని అన్నారు. దీనికి ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

లులూ మాల్‌లో ఫైర్ స్టోన్ గ్రిల్ బఫే రెస్టారెంట్

- 187 రకాల ఆహార పదార్థాలతో అతి పెద్ద మెనూ
- ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కూకట్‌పల్లి: హైదరాబాద్‌లోని ఆహార ప్రియుల కోసం లులూమాల్‌లో ఒక సరికొత్త ఫైర్ స్టోన్ గ్రిల్ బఫే రెస్టారెంట్ ప్రారంభమైంది. దిగుమతి చేసుకున్న ఒల్కనిక్ స్టోన్ మీదే వంటలన్నీ చేయడంతో దాని ఫ్లేవర్‌తో కలిసి ఒక సరికొత్త రుచి ఇక్కడి వంటకాలకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఒకేసారి 200 మందికి పైగా ఇక్కడ కూర్చుని ఈ రుచులను ఆస్వాదించవచ్చు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పాల్గొని రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొన్నారు. నిర్వాహకులు సూర్యదేవర అజయ్, సూర్యదేవర శ్రీలక్ష్మీగౌతమ్ మాట్లాడుతూ.. కొండాపూర్‌లో తమ మొదటి రెస్టారెంట్‌ను గతంలో ప్రారంభించామని ఇది రెండవదని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు



పాస్టర్లతో కలసి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తన సొంత నిధులతో 200 మంది పాస్టర్లకు నూతన దుస్తులను అందజేశారు. క్రిస్మస్ పండగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సబిహా బేగం, ముద్దం నర్సింహయాదవ్, డేవిడ్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తిచేయాలి

కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ డీ–బ్లాక్, సఫ్దార్ నగర్‌లలో సీసీరోడ్డు పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం కార్పొరేటర్ సబిహా బేగం పనులను పరిశీలించారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, మీర్జా, అస్లాం బేగ్, షేక్ రఫీక్, షఫీ, మహమ్మద్ రఫీక్, బాబా, సలీం, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

కాంగ్రెస్ నాయకుడు సుంకన్న

మోతీనగర్: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో రెండింటిని అమలు పర్చారని.. మిగిలిన నాల్గు గ్యారంటీలను త్వరలో అమలు పర్చడానికి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సి. సుంకన్న పేర్కొన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుంకన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడే పార్టీ అని తెలిపారు. బండి రమేష్ సారథ్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు కార్యకర్తలు ప్రజలకు సేవ చేయడానికి ఎప్పుడు ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజారావు, శ్రీరాము, భాగ్య, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ హాల్‌లోకి దూకిన వారిపై

కఠిన చర్యలు తీసుకోవాలి



కూకట్‌పల్లి చౌరస్తాలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

వామపక్ష నాయకుల డిమాండ్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం కూకట్‌పల్లి చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయటమేనని అన్నారు. పార్లమెంట్‌లో పొగ బాంబులు వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారు హాల్‌లోకి రావటానికి ఎంట్రీ పాసులు ఇచ్చిన ఎంపీని సస్పెండ్ చేయాలన్నారు.

- దేశంలో ప్రజాస్వామ్యం కనుమరుగైపోయిందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందన్నారు. ఒంటెద్దు పోకడలు దేశానికి చాలా ప్రమాదకరమని అన్నారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు ఐలాపురం రాజశేఖర్, ఎం. శంకర్, జి.కృష్ణ, కె.కృష్ణనాయక్, ఎండీ.ఇక్బాల్, కార్తీక్, రాజు, సుగుణ, ధర్మారావు, జోగయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సెమీ-క్రిస్మస్ వేడుకలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: సెమీ -క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగులు, సిబ్బందితో కలిసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి రఘునాథస్వామి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎక్స్‌టెన్షన్ మీడియా అధికారి అంజయ్య, డిప్యూటీ పారామెడికల్ అధికారి సింహారాజు, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యం , వివిధ కేటగిరిలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఈశ్వర్, శ్రీనివాస్, గిరికాంత్, అనిల్, పద్మ, అన్నపూర్ణ, రామ్‌రెడ్డి, జేమ్స్ దాస్, శ్రీచాంద్, అక్షయ్, విజయ్, మంజుల, శ్రీవిద్య, నాగలక్ష్మి, నాగరాజు, కమల్, విజయ్, బాలాజీ, సత్యనారాయణ, ప్రకాష్, అమరేశ్వరి, గణేష్ పాల్గొన్నారు .



సీసీరోడ్డు పనుల పరిశీలన

బాలానగర్: పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందుకు తగిన విధంగా నిధులు విడుదల చేశారని కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పూల్‌బాగ్ కాలనీలో దక్షిణ మధ్య రైల్వే చొరవతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పూల్ బాగ్ కాలనీ అధ్యక్షులు పి.సభాపతిరెడ్డి, సభ్యులు ప్రభాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రాజు, సుధాకర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

వేద మంత్రోచ్ఛరణల మధ్య భూమిపూజ మహోత్సవం



ఆలయ కల్యాణ మండపానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనీ ఫేజ్–2లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో కొత్తగా కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. శుక్రవారం వేద మంత్రోచ్ఛరణల మధ్య భూమిపూజ మహోత్సవం జరిగింది. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన భూమిపూజకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంగళ వాయిద్యాలు, శివ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఈ పూజలో అరుణ్ గురుస్వామి, ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ, డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాథ్ యాదవ్, జోగిపేట భాస్కర్, లింగయ్య, గోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, యాదవరెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, అఖిలేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలను అందజేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల ఖర్చు వివరాలను సత్వరమే అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ జి.విజయేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, ఎన్నికల వ్యయ పరిశీలకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొత్త వేరియంట్‌తో అప్రమత్తంగా ఉండాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.టి.రఘునాథ్ స్వామి సూచించారు. కరోనా లక్షణాలు ఉంటే వెంటనే సమీప ప్రాథమిక / పట్టణ ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానాలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కొత్త వేరియంట్‌తో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో వైద్యులు సిబ్బందిని అప్రమతం చేసినట్లు తెలిపారు. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రిలో 50 పడకలు, ఘట్‌కేసర్ ఆస్పత్రిలో 10 పడకలు, మేడ్చల్‌లో 10 పడకలతో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచామన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



బర్డ్స్ అండ్ బ్లూమ్స్ పాఠశాలలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు

మోతీనగర్: సంస్కృతి సంప్రదాయాలతో పాటు పండుగల పర్వదినాల ఆవశ్యకతను తెలపాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని బర్డ్స్ అండ్ బ్లూమ్స్ పాఠశాల కరస్పాండెంట్ శశిభూషణ్ పేర్కొన్నారు. శుక్రవారం బాలాజీ స్వర్ణపురికాలనీలోని పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతిప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహ మోడల్ స్కూల్‌లో..

భాగ్యనగర్‌కాలనీ: ఇంద్రాహిల్స్‌కాలనీ స్నేహ మోడల్ స్కూల్‌లో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చీర్స్ ఫౌండేషన్ అనాథాశ్రమంలో..

మూసాపేట: కూకట్‌పల్లి కైత్లాపూర్ రాఘవేంద్ర కాలనీలోని చీర్స్ ఫౌండేషన్ అనాథాశ్రమంలో క్రిస్మస్ వేడుకలను శుక్రవారం బీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర కార్మిక నాయకులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసాచారి, మనోజ్‌కుమార్, అనిల్, సుదర్శన్, జగన్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



అనాథాశ్రమంలో చిన్నారుల మధ్య క్రిస్మస్ వేడుకల్లో రవిసింగ్





స్నేహ మోడల్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



కృష్ణవేణి హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించుకుంటున్న చిన్నారులు, స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు

కృష్ణవేణి హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ సంబురాలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: దుబాయిగేట్‌లోని కృష్ణవేణి హైస్కూల్‌లో విద్యార్థులు సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ప్రిన్సిపాల్ దీపికరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు కేక్ కట్ చేశారు. చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో ఆకట్టుకున్నారు.చిన్నారులు ఆటపాటలతో అలరించారు.